క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన నీతిశ

అభినందించిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన గుర్రం నీతిశ తమిళనాడు రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఫస్ట్ సౌత్ ఇండియా అండర్- 23 రెజ్లింగ్ పోటీలలో జాతీయ స్థాయిలో మెడల్స్ (బ్రాంజ్, సిల్వర్) సాధించింది. ఈ సందర్భంగా నీతిశ విజయాన్ని అభినందిస్తూ సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఆమెను సన్మానించారు. అనంతరం మెడల్‌ను బహూకరించి, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. నీతిశ తల్లిదండ్రులు గుర్రం రామాంజనేయులు, యశోద, ఎస్సీ సెల్ నాయకుడు గుంటూరు ఆశీర్వాదం ఉన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. ఆనందంతో రైతులు

అచ్చంపేట: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో కురిసిన వర్షాలకు పత్తి పంట వేసిన రైతులు ఆ తరువాత వర్షాలు లేకపోవడంతో మొలచిన మొక్కలను రక్షించుకోలేక విలవిలలాడారు. దేవుడు కరుణించి కురుస్తున్న వర్షాలకు మొక్కలకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీపీఎస్ విధానం రద్దు చేయాలి

క్రోసూరు: గత ప్రభుత్వం తెచ్చిన గ్యారంటీ పెన్షన్ స్కీం అమలు కోసం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ టి.శరత్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్న జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం జీపీఎస్ విధానం జీవోను రద్దు చేయకపోతే ఎస్టీయూ పోరు బాట పడుతుందని హెచ్చరించారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంకొండ: సబ్సిడీపై ఇచ్చే విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో డి.కృష్ణయ్య తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాల రైతులకు విత్తనాలను పంపిణీ చేశామని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా కురవడంతో వ్యవసాయ సీజన్ ఆలస్యమైందని దీనితో అధిక శాతం మంది రైతులు ఆసక్తి చూపలేదని అన్నారు. మిగిలిన గ్రామాల రైతులు కూడా విత్తనాలను తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇప్పుడు అందుబాటులో జీలుగ, పిల్లి పెసర, కందులు తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా వరి పైరును సాగు చేసే రైతులకు కూడా విత్తనాలను పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు జూలై నెల ముగిసేలోగా వరి విత్తనాలు అందుతాయని ఆయన తెలిపారు.

చెరుకుంపాలెం సర్పంచ్‌గా శ్రీనివాసరావు



అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామ సర్పంచ్‌గా పోట్ల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా కొనసాగిన చింతగుంట్ల హనుమంతరెడ్డి తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారు. ఉప సర్పంచ్ అయిన శ్రీనివాసరావును సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల కాపీని పంచాయతీ కార్యదర్శి శివయ్య అందచేశారు.

అతిసార రాకుండా జాగ్రత్తలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్

మాచర్ల: పట్టణంలో అతిసార వ్యాధి పెరిగే సూచనలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉంచేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుని ప్రతి వార్డులో పారిశుధ్య పనులు చేయటం జరుగుతుందన్నారు. ప్రజలు అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అందులో భాగంగా 1వ వార్డు నుంచి 31వ వార్డు వరకు మున్సిపాలిటీ నుంచి సరఫరా చేసే నీటిని వాడవద్దని, కూరగాయలు, బియ్యం కడిగేందుకు ఉపయోగించరాదన్నారు. వంటకు సైతం మున్సిపల్ కుళాయి నుంచి వచ్చే నీటిని ఉపయోగించటం వలన ఇబ్బంది పడే అవకాశముందన్నారు. కావున పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడో...!?

- భృతి కోసం ఎదరు చూస్తున్న నిరుద్యోగులు
- ఎన్నికల సమయంలో ఊదరగొట్టి మరీ ప్రచారం
- నిబంధనలు పెట్టేందుకు కుస్తీ పడుతున్న ప్రభుత్వం
- నిరుద్యోగులందరికీ భృతి ఇవ్వాలని కోరుతున్న నిరుద్యోగులు
- నియోజకవర్గంలో 75,899 మంది నిరుద్యోగులు



కూటమి సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యత అయిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

సత్తెనపల్లి: తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి ఇస్తామని ఎన్డీఏ కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఊదరగొట్టి మరీ ప్రచారం చేశారు. దాన్ని సూపర్ సిక్స్ పేరుతో మేనిఫెస్టోలోనూ పెట్టింది. కూటమిలోని ప్రధాన పార్టీ నేత చంద్రబాబు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి ఇస్తామని పలు బహిరంగ సభల్లో హామీ ఇచ్చి నిరుద్యోగులను ఆకర్షించారు. ఎలాంటి నిబంధనలు ఉంటాయో చెప్పకుండా నిరుద్యోగులకు భృతి కింద రూ.3 వేలు ఒక్కొక్కరికి ఇస్తానని చెప్పడంతో దాన్ని నమ్మి నిరుద్యోగులంతా కూటమికి అధికారం కట్టబెట్టారు. ఆ మేరకు తమకు భృతి ఎప్పుడు ఇస్తారోనని నిరుద్యోగులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అయితే కూటమి అధికారంలోకి రాక మునుపు ప్రకటించిన భృతి పథకంలో నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పారని.. అందరికీ ఇస్తారని కొందరంటుంటే, వయసు, విద్యార్హత వంటి నిబంధనలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చి నెల దాటినా నిరుద్యోగ భృతి గురించి పట్టించుకోకపోవడంతో అసలు ఇస్తారా? లేదా? గతంలో మాదిరిగా ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన చందమే అవుతుందా అనే అనుమానాలు నిరుద్యోగుల్లో కలుగుతున్నాయి. అయితే ఎన్నికల సభల్లో చెప్పిన విధంగా ఏ నిబంధన లేకుండా నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని వారు కోరుతున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 75,899 మంది 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి ఉద్యోగం లేకుండా ఉన్న నిరుద్యోగులు ఉన్నారు. వారందరూ తమకు నిరుద్యోగ భృతి వస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగ భృతి వస్తే ఉద్యోగం సంపాదించుకునే లోగా వేడినీళ్లకు చన్నీళ్లు తోడులా సాయ పడుతుందని భావిస్తున్నారు.

నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలి



నేను బీఎస్సీ బీఈడీ పూర్తి చేశాను. ఎన్డీఏ నేతలు సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు అవుతుంది. ఇంత వరకు హామీ అమలుకు ఎలాంటి కార్యాచరణ ప్రారంభించలేదు. నిరుద్యోగులను ఇబ్బంది పెట్టకుండా తక్షణమే ప్రభుత్వ హామీని అమలు చేయాలి.

–మద్దు వినోద్‌కుమార్, బీఎస్సీ బీఈడీ, నందిగామ

మాట నిలబెట్టుకోవాలి



నేను ఎంఏ బీఈడీ పూర్తి చేశాను. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా కూడా సేవలు అందించాను. ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి. సంబంధిత జీవో విడుదల చేసి హామీని అమలు చేయాలి. నిరుద్యోగ భృతి కోసం నాలాంటి ఎందరో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. చెప్పిన మాట ప్రకారం నిబంధనలు లేకుండా ప్రతి నిరుద్యోగికి భృతి ఇవ్వాలి.

–షేక్ రుక్సానా పర్వీన్, ఎంఏ బీఈడీ, సత్తెనపల్లి

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: విజయవాడలో ఇటీవల నలుగురు న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై తరచూ దాడులు జరుగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. న్యాయవాదులపై దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మన్నెం వెంకటేశ్వరరావు, న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, జె.విజయ్ కుమార్, నరసింహ శాస్త్రి, జూపల్లి శేషయ్య, రాజవరపు నరసింహారావు, బూతుకురి రామిరెడ్డి, బి.సంగీతరావు, జి.పవన్, షేక్ ఫాజులుల్లా, నాగరాజు, పిల్లి సుధీర్, గుజ్జర్లపూడి సురేష్ బాబు, ఎర్రమాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశర్లపాడు గ్రామంలో రేషన్ షాపు సీజ్



రెంటచింతల: మండలంలోని పశర్లపాడు గ్రామం 26వ నంబర్ రేషన్ షాపులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి లబ్ధిదారులకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులలో వ్యత్యాసాలు గుర్తించి రేషన్ షాపును సీజ్ చేసినట్లు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మురళి సోమవారం తెలిపారు. రేషన్ లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. షాపులో ఉన్న నిత్యావసర సరుకులకు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకులకు, రికార్డులలో నమోదు చేసిన సరుకుల వివరాలకు తేడాలు ఉన్నాయన్నారు. దీంతో 1955 నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం 26వ నంబర్ రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు చేసి సీజ్ చేశామన్నారు. పూర్తి నివేదికను ఇన్‌చార్జి జేసీ వినాయకంకు పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులను కార్డుదారులైన లబ్ధిదారులకు అందజేయకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే రేషన్ షాపు డీలర్లపై కఠిన చర్యలు తీసుకుని షాపులను సీజ్ చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ మురళి హెచ్చరించారు. ఈ తనిఖీలలో మండల రెవెన్యూ అధికారి దాసరి కాంతారావు, వీఆర్వో అబ్దుల్ షుకూర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ

సత్తెనపల్లి: ఆధునిక విద్యని అందిస్తే అనేక రంగాలలో మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన ముందు వరుసలో నిలబెట్టేది మన దేశ యువత అని, ఓర్పు, నేర్పు కలిగి సత్ప్రవర్తనతో ముందుకు వెళితే సాధించలేనిది ఏదీ లేదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యు.కోటేశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ ఉపాధి సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువత అనేక రంగాలలో విద్యా ప్రమాణాలతో విద్యనభ్యసిస్తూ వృత్తి పరమైన నైపుణ్యాలను కలిగి, చిన్న పాటి సౌకర్యాలు ఉంటేనే అద్భుతాలు చేయగలిగే సత్తా కలిగి ఉన్నారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మన దేశంలో తయారీ సేవల రంగాల్లో నైపుణ్యం కలిగిన వారు తక్కువగా ఉన్నారని అన్నారు. స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ట్రైనర్ షేక్ రవి, న్యాయవాది ఎ.కమలాకర్, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- అమలు కాని వాల్టా చట్టం
- తరిగిపోతున్న పచ్చదనం



పట్టణంలో అన్నాక్యాంటీన్ ముందు నరికన పచ్చని వేప చెట్టు

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కైనా నాటి ఆ మొక్క పెరిగేందుకు చూడాలి. శుభకార్యాలు జరిగే సమయంలో బహుమతులుగా మొక్కలను అందించే సంస్కృతి అలవడుతోంది. పర్యావరణానికి హాని కలిగించేలా పచ్చని చెట్ల నరికివేత విచ్చలవిడిగా కొనసాగుతుంది. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఎంతోమంది ప్రయాణికులకు నీడనిచ్చే వేప చెట్లు అన్నా క్యాంటీన్‌కు అడ్డంకిగా ఉన్నాయనే నెపంతో వాటిని నిర్లక్ష్యంగా సోమవారం నరికివేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నాటిన ఈ చెట్ల నీడన ప్రయాణికులు సేద తీరుతున్నారు. ఈ చెట్లను నరికి ముక్కలు ముక్కలుగా చేసి తరలిస్తున్నారు. ఇదే తరహాలో ఇటీవల జలవనరుల శాఖకు చెందిన పది చెట్లను నరికివేసి విక్రయించిన ఘటనలు కూడా ఉన్నాయి.

పర్యావరణానికి విఘాతం...

శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమార్కులకు వరంగా మారింది. చట్టాన్ని అమలు చేయడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం పర్యావరణానికి గొడ్డలి పెట్టుగా తయారైంది. పట్టణ నడిబొడ్డున పెద్దపెద్ద వృక్షాలు నేలకొరుగుతున్నా, చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అసలు వాల్టా చట్టం అమల్లో ఉందా.. లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఒత్తిళ్లతో వదిలేస్తున్నారు..

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల పరిధిలో నిత్యం ఏదో ఒకచోట చెట్లను నరికి వేస్తున్నారు. అక్రమ కలప వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతున్నా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు చూసి చూడనట్లు పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కలప

నిబంధనలు ఇవీ...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతు పొలంలో రహదారులు, కొండల్లో చెట్లు నరికి వేయాలంటే వాల్టా చట్టం ప్రకారం సర్వే నెంబర్‌తో సహా దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. రెవెన్యూ అధికారులు పరిశీలించి అటవీ శాఖ అధికారులకు నివేదిక పంపాలి. వారి అనుమతి కోసం ట్రాక్టర్‌కు రూ.500 చలానా చెల్లించాలి. రెండు శాఖల ఆమోదం లభించాకే చెట్లు నరికివేసి తరలించాలి. అయితే క్షేత్రస్థాయిలో అసలు అధికారులకు దరఖాస్తులు చేస్తున్న దాఖలాలే లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి మరి. దీనిపై మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మిని వివరణ కోరగా ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని తొలగించమని విన్నవించారని చెప్పారు. ఈ క్రమంలో ఆ చెట్లను ఎవరు నరికారనేది తెలుసుకుంటానన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హం

సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వెంకట నాగ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట నాగ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హమని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అధ్యక్షతన సత్తెనపల్లి నాలుగు న్యాయస్థానాల్లో ఉన్న కోర్టు సిబ్బందికి మోటారు వాహనాల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సత్తెనపల్లి సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ శరీరంలో ప్రధాన అవయవం తల అని, అనుకోకుండా చిన్న ప్రమాదం సంభవించినా తలకు గాయం అయితే మరణం సంభవించే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దని, అలా ఇస్తే దాని యజమానులపై కూడా కేసు నమోదు అవుతుందన్నారు. సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తాషిద్ హుస్సేన్ మాట్లాడుతూ కారులో ప్రయాణం చేసే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సత్తెనపల్లి రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, వాహనము నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వారే కాకుండా వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. పిడుగురాళ్ళ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ నిత్యం సంభవిస్తున్న రోడ్డు ప్రమాద కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది డి.శ్రీనివాసరావు, నాలుగు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

దళితుడిని గాయపరచిన వ్యక్తిని అరెస్టు చేయాలి

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు



గార్లపాటి దాసు, చిలకా భాస్కరరావు

క్రోసూరు: దళితుడిపై దాడి చేసి తీవ్రగాయాల పాలు చేసిన వెంకట సుబ్బారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు గార్లపాటి దాసు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివరాలు తెలుపుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం వెన్న పేరూరు గ్రామంలో దళితుడు కదిరి ప్రభాకర్ పక్క గ్రామంలో తన బంధువు మరణించగా వెళ్లి సాయంత్రం అంత్యక్రియల కార్యక్రమం ముగించుకొని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా నీరసంగా ఉండటంతో ఒక అరుగు మీద పడుకొన్నాడు. అరుగుకు ఎదురుగా ఉన్న గజ్జల వెంకట సుబ్బారెడ్డి.. ప్రభాకర్ అరుగు మీద పడుకోవటం జీర్ణించుకోలేక కులం పేరుతో దుర్భాషలాడుతూ మా ఎదురుగా అరుగు మీద పడుకుంటావా అంటూ ఇష్టం వచ్చినట్లు కొట్టాడని తెలిపారు. దీంతో ప్రభాకర్ స్పృహ తప్పిపోయాడని చెప్పారు. అంతేకాక ఇక్కడ నుంచి పోతవా లేదా అంటూ హోటల్‌లో కాగుతున్న వేడి నూనెను తీసుకువచ్చి ప్రభాకర్‌పై పోసి తీవ్ర గాయాల పాలు చేసాడని వివరించారు. ప్రస్తుతం వైద్యులు ప్రభాకర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారన్నారు. దీనికి కారకుడైన గజ్జల వెంకట సుబ్బారెడ్డిని తక్షణమే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు నాన్ బెయిలబుల్ కేసు కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్‌కు న్యాయం చేసే విధంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకటనలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి అధ్యక్షులు చిలక భాస్కరరావు పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి



సమగ్ర రక్షిత మంచినీటి పథకం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ హనుమంతరావు

అమరావతి: స్థానిక సమగ్ర రక్షిత మంచినీటి పథకం నుంచి సరఫరా చేసే నీటిని ప్రతిరోజు క్లోరినేషన్ చేసి పరిశుభ్రమైన నీటినే ప్రజలకు అందించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. సోమవారం స్థానిక సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఎంపీపీ మేకల హనుమంతరావు సందర్శించి మాట్లాడుతూ క్లోరైడ్ టెస్ట్ చేసి క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అమరావతి మండలంలో పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది సహకారంతో డయేరియా సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనాలన్నారు. మండలంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని ఫిర్యాదులు ఏమైనా ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వర్షాకాలం ఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు



గోళ్ళపాడులోని ఉపాధి హామీ గ్రామ సభలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌లో భాగంగా సోమవారం గ్రామ సభలు జరిగాయి. రుద్రవరం, కుందురువారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఎస్ఆర్పీ ఎం లోకేష్ పాల్గొని ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. సోషల్ ఆడిట్ సభ్యులు చేపట్టిన అంశాలను చదివి వినిపించారు. ఆయా గ్రామ సభల్లో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు శివ, శరత్‌కుమార్, తిరుపాల్, కిశోర్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ మనందరి బాధ్యత

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్



జనాభా నియంత్రణపై ర్యాలీ

క్రోసూరు: ప్రపంచ జనాభా దినోత్సవం పక్షోత్సవాలు పురస్కరించుకొని సోమవారం క్రోసూరు మండలంలోని అనంతవరం గ్రామంలో జనాభా దినోత్సవంపై ర్యాలీ నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ జనాభా నియంత్రణ మనందరి బాధ్యత అని అన్నారు. ప్రపంచ జనాభా జూలై 11వ తేదీ 1987న ఐదు బిలియన్లకు చేరిన సందర్భంగా ఐక్యరాజ్యసమితి జనాభా దినోత్సవం నిర్వహించడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. దీనిని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ తరఫున ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన నినాదంతో ప్రజల్లో జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు ఈ సంవత్సరం తల్లి-బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం అనే నినాదంతో అవగాహన కల్పించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జూలై 24వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధిక జనాభా వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది వీధుల్లో పలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ఆయన స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.